నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఆర్కేపురం, ఫిబ్రవరి 14 : లక్షీనగర్, ఇందూ అరణ్య అపార్ట్‌మెంట్స్ జైపూరి కాలనీ, రాజీవ్ స్వగృహ కల్ప ఏ,బీ బ్లాక్, రాజీవ్‌గృహ కల్ప బీసీ బ్లాక్, విశాలాంధ్ర, పెద్దఅంబర్‌పేట్ ఇండస్ట్రీయల్ 11కేవీ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం ఈ దిగువ తెలిపిన ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు సరూర్‌నగర్ డీఈ రామకృష్ణ తెలిపారు. లక్షీనగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు ఎస్ఆర్ఎల్ కాలనీ, నాగేశ్వర్‌రావు కాలనీ, సత్యనగర్, గౌడ్స్ కాలనీ పరిసర ప్రాంతాలు, ఇందూ అరణ్య అపార్ట్‌మెంట్స్ ఫీడర్ పరిధిలో ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ఇందూ అరణ్య అపార్ట్‌మెంట్స్, ఇందూ అరణ్య విల్లాస్ పరిసర ప్రాంతాలు, జైపూరి కాలనీ ఫీడర్ పరిధిలో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు ఆనంద్‌నగర్, కృషినగర్, ఫత్తుల్లాగూడ, జైపురి కాలనీ రాజీవ్ స్వగృహ ఏబీ పరిసర ప్రాంతాలు, రాజీవ్ స్వగృహ కల్ప పరిధిలో రాజీవ్ స్వగృహ ఏబీబీసీ బ్లాక్ పరిసర ప్రాంతాలు, విశాలాంధ్ర పరిధిలో ఫత్తుల్లాగూడ, బ్లైండ్స్ కాలనీ, హనుమాన్‌నగర్, విశాలాంధ్ర, వెంకటేశ్వర కాలనీ పరిసర ప్రాంతాలు, పెద్దఅంబర్‌పేట్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 1గంటల నుంచి 2గంటల వరకు పెద్దఅంబర్‌పేట్ టౌన్, సూర్యవంశి, గండి చెరువు రోడ్డు పరిసర ప్రాంతాల్లో విద్యుత్‌ను నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించాలి

ఫెడరల్ బ్యాంక్ నూతన బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న డీసీసీ సీహెచ్ ప్రవీణ్ కుమార్

మన్సూరాబాద్, ఫిబ్రవరి 14: ఖాతాదారులకు మెరుగైన సేవలను అందిస్తూ ప్రజల మన్ననలు పొందేందుకు బ్యాంకు యాజమాన్యాలు, సిబ్బంది కృషి చేయాలని ఎల్బీనగర్ డీసీసీ సీహెచ్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఎల్బీనగర్, నాగోల్ డివిజన్ రాక్ టౌన్ కాలనీ లో నూతనంగా ఏర్పాటు చేసిన ఫెడరల్ బ్యాంక్ నూతన బ్రాంచ్‌ను శుక్రవారం జోనల్ హెడ్ దిలీప్ తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డీసీపీ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ బ్యాంకులు సేవా కార్యక్రమాలను సైతం నిర్వహిస్తూ ప్రజలకు చేరువ కావాలని సూచించారు. ఫెడరల్ బ్యాంక్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో లోటస్ ల్యాప్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, ల్యాండ్ మార్క్ గ్రూప్ ఇండియా సీఎండీ పల్లె రవీందర్ రెడ్డి, బ్యాంకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శాలిని వారియర్, రీజినల్ హెడ్ చార్లీ దేవస్య, బ్రాంచ్ హెడ్, మేనేజర్ గోవిరెడ్డి సునీత తదితరులు పాల్గొన్నారు.

మూడు మొక్కలు నాటాలి

- 17న కేసీఆర్ పుట్టిన రోజు.. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటండి
- ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

లేమూరులో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

కందుకూరు. ఫిబ్రవరి, 14: మాజీ సీఎం కేసీఆర్ విజన్ ఉన్న నాయకుడని మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మండల పరిధిలోని లేమూరులో ఆమె మాట్లాడుతూ ఈనెల 17న కేసీఆర్ పుట్టిన రోజు సందర్భంగా మూడు మొక్కలు నాటాలని బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ హరితహారం ప్రవేశపెట్టి మొక్కలు నాటడానికి ప్రాధాన్యత ఇచ్చినట్లు పేర్కొన్నారు ఆయన కృషి వల్ల నేడు రాష్ట్రంలో పచ్చదనం విరాజిల్లుతుందని తెలిపారు. హరితహారం కేసీఆర్ మానస పుత్రిక అని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా హరితహారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. రోడ్లకిరువైపులా ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. అడవులు అంతరించి పోవడం వల్ల ఎడారిగా మారి వర్షాలు సరిగ్గా కురియక ప్రజలు ఇబ్బందులు పడుతున్న తరుణంలో కేసీఆర్ హరితహారం ప్రవేశపెట్టి మొక్కలు నాటి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మన్నే జయేందర్ ముదిరాజ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సురుసాని సురేందర్ రెడ్డి, సీనియర్ నాయకులు గంగాపురం లక్ష్మీనరసింహా రెడ్డి, కాకి దశరథ ముదిరాజ్, మేఘనాథ్ రెడ్డి, మాజీ సర్పంచులు పరంజ్యోతి, నరేందర్ గౌడ్, గణేశ్ భూపాల్ రెడ్డి డైరెక్టర్ పొట్టి ఆనంద్, సురుసాని సుదర్శన్ రెడ్డి, సురుసాని కొండల్ రెడ్డి, యాదగిరి, సురేశ్ భూపాల్ రెడ్డి , సామయ్య. సంజీవరెడ్డి, మోహన్ రెడ్డి కాకి రాములు చంద్రశేఖర్ రెడ్డి జనార్దన్ రెడ్డి లక్ష్మయ్య సామేల్ రాజ్,లిక్కి జంగారెడ్డి పాల్గొన్నారు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటా

పావనిని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ కవిత

బడంగ్‌పేట, ఫిబ్రవరి 15: మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 11వ డివిజన్ పరిధిలోని ప్రశాంతి హిల్స్ కాలనీలో నివసిస్తున్న తెలంగాణ జాగృతి నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షురాలు మిర్యాల పావనిని తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత శుక్రవారం పరామర్శించారు. పావని క్యాన్సర్ తో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకున్న ఆమె వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని ఆమె భరోసా ఇచ్చారు. అధైర్య పడవద్దని, ధైర్యంగా ఉన్నప్పుడే ఎలాంటి వ్యాధినైనా జయించడానికి అవకాశం ఉంటుందన్నారు. తెలంగాణ జాగృతి ఎల్లప్పుడు అండగా ఉంటుందని తెలిపారు. మీర్‌పేట్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు శ్రీ అర్కల కామేశ్ రెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్ రెడ్డి, మహిళా అధ్యక్షురాలు జమాల్పూర్ సునీత బాల్ రాజ్, స్థానిక మాజీ కార్పొరేటర్ ధనలక్ష్మి రాజ్ కుమార్, బీఆర్ఎస్ నాయకులు శ్రీను నాయక్, నర్సిరెడ్డి, జాగృతి నాయకులు లావణ్య తదితరులు ఉన్నారు.

సిబ్బంది అందుబాటులో ఉండాలి

కిట్లను పంపిణీ చేస్తున్న విజయ్ కుమార్ రెడ్డి

కందుకూరు, ఫిబ్రవరి 14 : పశువైద్య సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండి పశువుల సంరక్షణ కోసం కృషి చేయాలని రంగారెడ్డి జిల్లా పశువైద్యాధికారి విజయ కుమార్ రెడ్డి తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని రాచులూరు పశువైద్యశాలను సందర్శించారు. రైతులు, సిబ్బందితో మాట్లాడి రికార్డులను పరిశీలించారు. అదే విధంగా మాదాపూర్ గ్రామంలో మైత్రి సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల కోసం ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మైత్రి సెంటర్ల సేవలను వినియోగం చేసుకోవాలని కోరారు. డాక్టర్ షాహిన్ షేక్, రమేశ్, శివకుమార్ ,తరుణ్ పాల్గొన్నారు

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

ఉపాధ్యాయులతో విద్యార్థులు

కందుకూరు ,ఫిబ్రవరి,14 : మండల పరిధిలోని గుమ్మడవెల్లి ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తరగతుల గదుల్లోకి వెళ్లి తోటి విద్యార్థులకు పాఠాలను బోధించారు . ప్రధానోపాధ్యాయురాలిగా శ్రావ్య, ఐఏఎస్ భాను శ్రీ, డీఈవోగా పావని, ఎంఈవోగా ఇందులతోపాటు 20 మంది ఉపాధ్యాయులుగా మారారు. గుమ్మడవల్లి హెడ్ మాస్టార్ ధర్మ నాయక్ అధ్యక్షతన ముఖ్యఅతిథిగా గ్రామ మాజీ సర్పంచ్ ప్రభాకర్, గుమ్మడవెల్లి తండా ప్రధానోపాధ్యాయులు కట్ట గోపాల్, కోలన్ గూడ ఉపాధ్యాయులు ప్రభాకర్, ఇమామ్ గూడ ఉపాధ్యాయులు బాలరాజ్, ఆకుల మైలారం ఉపాధ్యాయులు ధనంజయ, వెంకటేశ్, అహ్మద్ , అమృత , బాలాజీ , గుమ్మడవల్లి ఉపాధ్యాయులు విజయ దుర్గ , రాధిక , భరత్ , అశ్విని , గ్రామ యువకులు మస్కు మహేశ్, నాగటి శివకుమార్, భరత్ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ ప్రభాకర్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని అన్నారు.

తులం బంగారం హామీని నిలబెట్టుకోవాలి

లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

కాప్రా, ఫిబ్రవరి 14: కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలతో నిరు పేద కుటుంబాలకు ఎంతో ఉపశమనం కలుగుతుందని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం కాప్రా తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ సుచరితతో కలిసి ఎమ్మెల్యే 38మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు సంబంధించిన రూ.38 లక్షల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు ఇచ్చిన 1 లక్షా 116 రూపాయలతోపాటు తులం బంగారం ఇస్తామని హామీనిచ్చారు. ఇచ్చిన హామీ ప్రకారం.. లబ్ధిదారులకు అందజేయాలని, పేదింటి ఆడ పడచులకు ఎంతో ఆసరాగా ఉంటుందన్నారు. పేదలను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు స్వర్ణరాజు, ప్రభుదాస్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లో ప్రెషర్ సమస్యలు తలెత్తకుండా చూడాలి

సమీక్ష సమావేశంలో పాల్గొన్న కార్పొరేటర్ చింతల అరుణ

మన్సూరాబాద్, ఫిబ్రవరి 14: రాబోయే వేసవికాలంలో కాలనీలలో తాగునీటి లో ప్రెషర్ సమస్యలు తలెత్తకుండా జలమండలి అధికారులు చర్యలు చేపట్టాలని నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సూచించారు. రాబోయే వేసవికాలంలో మంచినీటి సమస్యలు తలెత్తకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై శుక్రవారం ప్రశాంత్ నగర్ కాలనీలో జలమండలి అధికారులతో కార్పొరేటర్ చింతల అరుణ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ తాగునీటి సమస్యలపై కాలనీల ప్రజల నుంచి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత జలమండలి అధికారులదేనని తెలిపారు. రాబోయే మూడు నెలల పాటు జలమండలి అధికారులు, సిబ్బంది బాధ్యతతో మెలుగుతూ ప్రజల అవసరాలకు అనుగుణంగా తాగునీటిని అందించాలన్నారు. కాలనీలో చేపడుతున్న యూజీడీ పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించే విధంగా అధికారులు పర్యవేక్షించాలని కోరారు. యూజీడీ పనులు పూర్తయిన కాలనీలో రోడ్డు పునరుద్ధరణ పనులను త్వరిత గతిన చేపట్టి వాహనదారులు, పాదచారులకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి డీజీఎం మాధవి, జలమండలి మేనేజర్ అర్చన పాల్గొన్నారు.

కాలనీ సమస్యలు పరిష్కరిస్తా

ఆనంద్ నగర్ కాలనీ వాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బలాల

సైదాబాద్ ఫిబ్రవరి 14: కాలనీ వాసుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మలక్ పేట ఎమ్మెల్యే అహ్మద్‌బలాల అన్నారు. శుక్రవారం సాయంత్రం అక్బర్ బాగ్ డివిజన్ పరిధిలోని ఆనంద నగర్ కాలనీలో జలమండలి, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పర్యటించి ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానికంగా నెలకొన్న రోడ్లు, విద్యుత్ వీధి దీపాలు, శానిటేషన్, తాగు నీటి సమస్యలను సత్వరమే పరిష్కరించడానికి అధికారులు కృషి చేయాలని సూచించారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చేసే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అక్బర్ బాగ్‌డివిజన్ కార్పొరేటర్ మినాజుద్దీన్, జలమండలి, జీహెచ్ఎంసీ అధికారులు పాల్గొన్నారు.

అఫ్జల్ నగర్ కాలనీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల

ముంపు సమస్యకు చెక్..

మలక్ పేట: పాత మలక్‌పేట డివిజన్‌లో ముంపు సమస్యల నివారణకు బాక్స్ డ్రైన్లను నిర్మిస్తున్నట్లు ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల తెలిపారు. శుక్రవారం అఫ్జల్ నగర్‌లో కొనసాగుతున్న బాక్స్ డ్రైన్ పనులను జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో వరద నీటి సమస్యలు, ముంపు నివారణకు బాక్స్ డ్రైన్లను నిర్మించడం జరుగుతుందని తెలిపారు. ఇప్పటికే పాత మలక్ పేట డివిజన్‌లో పలు కాలనీల్లో బాక్స్ డ్రైన్ల నిర్మాణం చేపట్టి పూర్తిచేయడం జరిగిందని, త్వరలో మరిన్ని కాలనీలో వరద నీటి కాలువలను నిర్మించినట్లు తెలిపారు. కాలనీల నుంచి నేరుగా వరద నీరు మూసీలో కలిసే విధంగా డ్రైన్లను నిర్మిస్తున్నట్లు ఆయన తెలిపారు. అధికారులు, డీజీఎం సయ్యద్ హస్మత్ అలీ పాల్గొన్నారు.

వివిధ కోర్సుల పరీక్ష ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. అడ్వాన్స్‌డ్ పీజీ డిప్లమా ఇన్ హెల్త్ కేర్ కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్సైట్ www. osmania. ac. in లో చూసుకోవాలని సూచించారు.

పీహెచ్‌డీ కోర్స్ వర్క్ పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని పీహెచ్‌డీ కోర్స్ వర్క్ పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. 2022-23, 2023-24 బ్యాచ్ లకు చెందిన బ్యాక్లాగ్ అభ్యర్థులు తమ పరీక్ష ఫీజును వచ్చే నెల 12వ తేదీ లోగా సంబంధిత డీన్ కార్యాలయంలో చెల్లించాలని సూచించారు. ఈ పరీక్షలను మార్చి, ఏప్రిల్ నెలల్లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని తెలిపారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్సైట్ www. osmania. ac. in లో చూసుకోవాలని సూచించారు.

ముగిసిన జైళ్ల శాఖ స్పోర్ట్స్ మీట్

సీఎస్ శాంతి కుమారికి మెమొంటోను అందజేస్తున్న డీజీ సౌమ్య మిశ్రా

సైదాబాద్, ఫిబ్రవరి14 : తెలంగాణ జైళ్ల శాఖ ఆధ్వర్యంలో చంచల్ గూడ సీకా పరేడ్ గ్రౌండ్‌లో మూడు రోజుల పాటు నిర్వహించిన ఏడో రాష్ట్ర స్థాయి వార్షిక స్పోర్ట్స్ మీట్ 20 25 కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఈ ముగింపు కార్యక్రమానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంతర్జాతీయ ప్రమాణాలతోస్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నదని అన్నారు. తెలంగాణ జైళ్ల శాఖ చేపడుతున్న సంస్కరణలు దేశంలోనే అగ్రగామిగా నిలిచాయన్నారు. పోటీలలో విజేతలుగా నిలిచిన వారికి అభినందనలు తెలియజేసి, మెడల్స్ అందజేశారు. డీజీ డాక్టర్ సౌమ్యమిశ్రా మాట్లాడుతూ త్వరలో ఆల్ ఇండియా ప్రీజన్స్ స్పోర్ట్స్ మీట్ తెలంగాణ జైళ్ల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్నామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఐజీలు రాజేశ్, మురళీ బాబు, డీఐజీలు డాక్టర్ శ్రీనివాస్, సంపత్, జైలు సూపరింటెండెంట్ నవాబ్ శివకుమార్ గౌడ్, సీకా ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

నేడు సేవాలాల్ జయంతి వేడుకలు

బడంగ్ పేట, ఫిబ్రవరి14: మహేశ్వరం నియోజకవర్గ వ్యాప్తంగా శనివారం సేవాలాల్ జయంతి వేడుకలను నిర్వహించనున్నారు. మన్ సాన్, మీర్ పేట, బడంగ్‌పేట లో నిర్వహించే సేవాలాల్ జయంతి ఉత్సవాలకు మాజీమంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి హాజరుకానున్నారు. 9.30 గంటలకు ఉప్పుగడ్డ తండాలో, 10.30 గంటలకు మీర్ పేటలో, 11.15 లెనిన్ నగర్ లో నిర్వహించే సేవాలాల్ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొంటారని అధికారులు తెలిపారు.

ఏరోస్పేస్ చరిత్రలో మిధాని సరికొత్త అధ్యాయం

ఏరో ఇండియా సదస్సులో పాల్గొన్న కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

సైదాబాద్ ఫిబ్రవరి 14: కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ పరిధిలోని రక్షణ రంగ సంస్థ మిశ్రా దాతు నిగమ్ లిమిటెడ్ (మిధాని) ప్రముఖ మెటలార్జికల్ ప్రభుత్వ రంగ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 10 నుంచి 14 వరకు బెంగళూరు వేదికగా ఏరో ఇండియా సదస్సు జరిగిందని కంచన్ బాగ్ మిధాని సంస్థ తెలిపింది. ఈ సదస్సులో ఏరో స్పేస్, రక్షణ రంగంలో అధునాతనమైన పరికరాలను అందుబాటులోకి తీసుకొని వచ్చింది. భారత దేశ రక్షణ, అంతరిక్ష పరిశోధనలో మిధాని కీలకపాత్ర పాత్ర పోషించే విధంగా స్వదేశీ పరిజ్ఞానంతో పరికరాలను అభివృద్ధి చేసింది. అంతరిక్ష పరిశోధనలో అవసరమయ్యే సరికొత్త మూడు రకాల పరికరాలను ఏరో ఇండియా సదస్సులో ఆవిష్కరించారు. అధిక ఉష్ణోగ్రత నికిల్ అల్లాయ్ బిల్లెట్లు, అల్లా య్ ఎస్152 పోర్ట్ బారులు, సువార్ని 41 ప్లేట్లు, ఈ పరికరాలు అధునాతన విమానాలు, జెట్ ఇంజన్లను తయారీలో అంతరిక్ష సాంకేతిక అభివృద్ధికి కీలకం కానున్నాయి. భారత స్వదేశీ తేజస్ యుద్ధ విమానాలు తయారీ అంతరిక్ష ప్రయోగాల్లో విధాని సంస్థ ప్రత్యేక ఉత్పత్తులైన అధిక సామర్థ్యం కలిగిన టైటానియం మిశ్రమ లోహాలు నికెల్ ఆధారిత సూపర్ అల్లాయ్ అధిక శక్తి కలిగి తుప్పు నిరోధిక స్టీల్ భవిష్యత్తు అంతరిక్ష ప్రయోగాల్లో వినియోగించనున్నారు. ఏరో ఇండియా 2025 సందర్భంగా నిర్వహించిన సామర్థ్య కార్యక్రమంలో రెండు వ్యూహాత్మక మిశ్రమ లోహాలను స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేయడంలో గణనీయమైన కృషిచేసిన మిధాని సంస్థకు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ ప్రత్యేక గుర్తింపు పత్రాన్ని అందజేశారు. రక్షణ సాంకేతిక పరిజ్ఞానంలో ఆకర్షణీయమైన కృషి చేసేందుకు మిధాని ఉద్యోగులకు ప్రశంసా పత్రాలతో సత్కరించారు. ఈ అవార్డులు భారత దేశ అంతరిక్ష రక్షణ రంగంలో ఉపయోగపడే ఆవిష్కరణలు అంటూనే, లక్ష్యంపై మిధాని శ్రేష్ఠత నిబద్ధతను తెలియజేసిందని చెప్పారు.

ప్రపంచ వ్యాప్తంగా మిధాని..

జయ్ జగదాంబ, ఎన్సీసీ బేరింగ్స్ తో అవగాహన ఒప్పందాలపై ఎంవోయూ లపై సంతకాలు చేశాయి. ఈ ఒప్పందాలతో ప్రపంచ వ్యాప్తంగా మిధాని పరిధి విస్తరించిందని, కొత్త వ్యాపార సహకారాలను పెంపొందించుకుంటూనే ఏరో స్పేస్ సరఫరా చేసే విధంగా తన స్థానాన్ని బలోపేతం చేస్తుందని తెలిపారు. మెక్ ఇన్ ఇండియా చొరవతో కీలక భాగస్వామిగా మిధాని స్వదేశీ తయారీని మెరుగుపరచడం, విదేశీ దిగుమతి మీద ఆధారపడడాన్ని తగ్గించడంతో పాటు జాతీయ భద్రతా సాంకేతిక పురోగతికి అవసరమైన అధిక పనితీరు గల పరికరాలను అందించినట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మిధాని సీఎండీ గౌరీ శంకర్‌రావు, మిధాని డీపీఎం ముత్తుకుమార్, మార్కెటింగ్ జనరల్ మేనేజర్ ఏకే శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఇరు వర్గాల మధ్య ఘర్షణ

బడంగ్ పేట, ఫిబ్రవరి14: ఇరువర్గాలు ఘర్షణపడిన సంఘటన మీట్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.పంచాయతీరాజ్‌కాలనీ బి.ఎన్.రెడ్డి నగర్ నివాసముంటున్న వీరేశ్, గౌరీ శంకర్ రాత్రి సుమారు 00:30 గంటలకు తన డ్యూటీ పూర్తి చేసుకొని బీయన్ రెడ్డి మెయిన్ రోడ్డు నుంచి తన ఇంటి వైపు నడుచుకుంటూ వస్తుండగా మార్గం మధ్యలో దావత్ బిరియాని హోటల్ ముందు హోటల్‌లో పని చేసే ఓ వ్యక్తి ఫోన్ మాట్లాడుతూ తన దగ్గరకు వచ్చి ఫోన్ ను తన కాలుపై పగలగొట్టాడని వీరేశ్ అప్పుడే అక్కడికి వచ్చిన తన అన్న గౌరీశంకర్ కు వివరించాడు. సెల్ ఫోన్ పగలగొట్టిన అతడి దగ్గరికి వెళ్లి ఎందుకు ఫోన్ పగలగొట్టావని అడిగారు. హోటల్ లో పని చేసే కొంత మంది అక్కడికి వచ్చి వారితో గొడవపడ్డారు. వీరేశ్ అక్కడి నుంచి పారి పోగా వాళ్లు తన అన్నను కొట్టినట్లుగా ఫిర్యాదు చేశారు. బిర్యానీ హౌస్ మేనేజర్ కూడా ఆ వ్యక్తులకు సపోర్ట్ చేసి వాళ్లని కొట్టమని ప్రేరేపించాడని ఫిర్యాదు చేశారు. దావత్ బిర్యానీలో పనిచేసే నవీన్ కుమార్, హోటల్ ముందు ఫోన్ మాట్లాడుతున్న అభిషేక్ దాస్ అనే వ్యక్తిని వీరేశ్, గౌరీ శంకర్ చేతులతో కొట్టారని ఫిర్యాదు చేశారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని మీర్ పేట పోలీసులు తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో 4 లక్షల ఆస్తి నష్టం

వనస్థలిపురం, ఫిబ్రవరి 14: ఓ ఇంట్లో షార్ట్ సర్క్యూట్ తో మంటలు చెలరేగి ఇంట్లో ఉన్న గ్యాస్ సిలిండర్ పే పేలిన సంఘటన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. వైదేహి నగర్ కాలనీలోని షిరిడీ సాయిబాబా ఆలయం పక్కన సాయి శంకర్ అనే వ్యక్తి ఇల్లు ఉంది. ఇంటికి ముందు భాగంలో ఉన్న షటర్లో కొంత ఫర్నిచర్, గ్యాస్ సిలిండర్లు ఉంచారు. శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో ఆ ఇంట్లో షార్ట్ సర్క్యూట్ జరిగడంతో మంటలు వచ్చి అదే గదిలో ఉన్న సిలిండర్ అంటుకోవడంతో సిలిండర్ పేలింది. పెద్దగా శబ్దం రావడంతో స్థానికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. బయటకు పరుగులు తీసి ఏం జరిగిందని చూశారు. భయాందోళనకు గురైన స్థానికులు హయత్ నగర్ ఫైర్ స్టేషన్ కు ఫోన్ చేశారు. అక్కడికి తరలివచ్చిన పోలీసులు ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పి వేశారు. సుమారు నాలుగు లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు బాధితులు పేర్కొంటున్నారు. ఈ మేరకు వనస్థలిపురం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. విషయం తెలుసుకున్న బీఎన్‌రెడ్డి నగర్ కార్పొరేటర్ ముద్దులచ్చిరెడ్డి అక్కడికి చేరుకొని.. అగ్నిప్రమాదం సంభవించి నష్టం జరిగినప్పుడు ఇచ్చే పరిహారాన్ని బాధితుడికి అందజేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

గడువు పొడిగింపు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలోని బీఫార్మసీ పరీక్ష ఫీజు స్వీకరణ గడువును పొడిగించినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీ ఫార్మసీ (పీసీఐ) 3, 5, 7 సెమిస్టర్ల మెయిన్, అన్ని సెమిస్టర్ల బ్యాక్లాగ్ పరీక్ష ఫీజును ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఈ నెల 20వ తేదీ వరకు సంబంధిత కళాశాలలో చెల్లించవచ్చని చెప్పారు.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL SENIOR CIVIL JUDGE, RANGA REDDY DISTRICT, AT: IBRAHIMPATNAM
E.P.No. 6 OF 2023 IN O.S.No. 122 OF 2022

Between:
N. Akshay and another ...DHR/Petitioners
AND
Sailesh Kumar Gujjar and another ...JDR/Respondents
To,
1. Mr.Sailesh Kumar Gujjar, S/o. Late Nagender Rao Gujjar, Occ: Business, R/o. 4-1-42, Old Bhoiguda, Subhash Road, Secunderabad-03.
2. Nandini Gujjar, W/o. Sailesh Kumar Gujjar,